మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 222 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## మంచి నాయకుడు కావాలంటే త్యాగం చేయాల్సిందే



హైదరాబాద్, (ప్రజా మంటలు):
జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని.. త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని చెప్పారు.ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు."మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతోమంది నాయకులు మనందరికీ ఆదర్శం. నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నాను. నాయకులు డబ్బు, సమయం, వ్యక్తిగత జీవితం.. ఇలా అన్నీ త్యాగం చేయాలి. మంచి లీడర్ కావాంటే ధైర్యం, త్యాగం ఉండాలి. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలి. ఐఎస్‌బీలో ఉన్న వారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు. హైదరాబాద్‌ను 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలి. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చను. న్యూయార్క్, లండన్, పారిస్‌తో పోల్చాలనుకుంటాను. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పనిచేయాలి. మా ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు. కానీ.. మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్ అందిస్తుంది. దురదృష్టవశాత్తు ఒలింపిక్స్‌లో భారత్ స్వర్ణపతకాలు గెలవలేకపోయింది. అక్కడ అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలి"అని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకం అవ్వగలిగితే ఏదైనా సాధించవచ్చని చెప్పుకొచ్చారు. జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని అన్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతో మంది నాయకులు మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. తాను నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నానని గుర్తు చేశారు.నాయకులు డబ్బు, వ్యక్తిగత జీవితం, సమయం ఇలా చాలానే త్యాగాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని విద్యార్థులకు సూచించారు. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలన్నారు. ఐఎస్‌బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు అని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలని కోరారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చనన్నారు. కేవలం న్యూయార్క్, పారిస్, లండన్‌తో పోల్చాలనుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పని చేయాలని సూచించారు. తమ ప్రభుత్వం కార్పొరేట కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు కానీ, మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్?ను మాత్రం అందిస్తుందని చెప్పారు.ఒలింపిక్స్ లోభారత్ దురదృష్టవశాత్తు స్వర్ణ పతకాలు గెలవలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఒలింపిక్స్?లో అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి లో పిలుపునిచ్చారు.

**- ధైర్యం, పేదల పట్ల ప్రేమనే నాయకత్వ లక్షణాలు**
**- త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం**
**- ప్రజలతో మమేకం అవ్వగలిగితే ఏదైనా సాధించవచ్చు**
**- ఐఎస్‌బీ విద్యార్థుంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు**
**- మాకు న్యూయార్క్, పారిస్, లండన్‌లతోనే పోటీ**
**- - ఒలింపిక్స్‌లో తెలంగాణకు పతకాలే లక్ష్యం**
**- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో సీఎం రేవంత్**

## చట్టబద్ధమైన నిర్మాణాల జోలికెళ్లం

**- ఆ విషయంలో భయపడాల్సిన అవసరం లేదు**
**- సీఎం రేవంత్ ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం: హైడ్రా కీలక ప్రకటన**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రియల్ ఎస్టేట్‌కు భరోసా కల్పించేలా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా స్పందించింది. ఈ మేరకు కీలక ప్రకటన విడుదల చేసింది. చట్టబద్ధమైన అనుమతులున్న వెంచర్ల విషయంలో భయపడాల్సిన అవసరం లేదని చెప్పింది. "చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేస్తారని ప్రచారం చేస్తున్నారు. చెల్లుబాటు అయ్యే అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేయబోమని సీఎం చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంది" అని హైడ్రా స్పష్టం చేసింది.

## జీవో 29 వల్ల ఎలాంటి నష్టం జరగదు

**- పరీక్షలు తరచూ వాయిదా పడితే అభ్యర్థులకే మంచిది కాదు.**
**- ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ హామీ ఏమైందో భాజపా నేతలు చెప్పాలి**
**- గాంధీభవన్ మీడియా సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
అభ్యర్థులను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఎంతమంది ఉద్యోగాలు ఊడగొట్టిందో తమ వద్ద లెక్క ఉందన్నారు. పరీక్షలు తరచూ వాయిదా పడితే అభ్యర్థులకు మంచిది కాదు. 563 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ ఫిబ్రవరిలో విడుదలైంది. నిరుద్యోగులను ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను కోరుతున్నాం. రాజకీయ నేతల కుట్రపూరిత ఉచ్చులో విద్యార్థులు పడొద్దు. ఎవరిపైనా లాఠీఛార్జ్ చేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రధాని మోదీ హామీ ఏమైందో భాజపా నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.గత పదేళ్లలో భాజపా ప్రభుత్వం ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు."ప్రధాని



మోదీ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి లక్షల మంది ఉద్యోగాలు పోగొట్టారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కసారి కూడా గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వలేదు. కనీసం 70 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ఇంటర్ ఫలితాలను తప్పుల తడకగా ఇచ్చి వందలాది మంది విద్యార్థుల చావులకు కారణమైంది. కానీ, 10 నెలలు కూడా పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసింది. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో భారాస ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ప్రస్తుతం చర్చనీయాంశమైన జీవో 29ను ఫిబ్రవరి నెలలో ఇచ్చారు. విపక్షాలు ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదు.

## జీవో 317పై నివేదిక రెడీ

**- సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసిన కేబినెట్ సబ్ కమిటీ**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
జీవో 317పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వేగం పెంచింది. కమిటీ రూపొందించిన నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేసింది.వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు, మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పలువురు మేధావులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను ఈ రోజు సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అందజేసింది.

## జీవో 29 వల్ల మాకు అన్యాయం

**- మళ్లీ ఆందోళన బాట పట్టిన గ్రూప్-1 అభ్యర్థులు**
**- అశోక్‌నగర్ చౌరస్తాలో నిరసన**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
అశోక్‌నగర్ చౌరస్తాలో గ్రూప్-1 అభ్యర్థులు మళ్లీ ఆందోళన చేస్తున్నారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల గొంతు కోస్తోందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో చేరుకున్న అభ్యర్థులు గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల రిజర్వేషన్



మిగతా 2లో..

## నిఘా నీడన గ్రూప్-1 మెయిన్స్

**- భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**
**- తొలిసారి జీపీఎస్ ట్రాకింగ్ విధానం అమలు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
గ్రూప్-1 ప్రధాన పరీక్షలకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరి బయోమెట్రిక్ తీసుకోనుండగా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రం తరలించే వాహనానికి తొలిసారిగా జీపీఎస్? వినియోగించనున్నారు. మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 46 పరీక్ష కేంద్రాల్లో 31,383 మంది

మిగతా 2లో..

## తైవాన్‌పై యుద్ధానికి సిద్ధం కావాలి..!

**- సైన్యానికి జిన్‌పింగ్ పిలుపు**



ప్యాగ్యాంగ్ (ప్రజా మంటలు):
తైవాన్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశమున్నట్లు తెలుస్తోంది. యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తమ దేశ సైనికులకు పిలుపునిచ్చినట్లు సమాచారం. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియా సంస్థ కథనాలు ఉటంకించాయి.వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా 'యుద్ధానికి సన్నాహాలను సమగ్రంగా బలోపేతం చేయాలి. దళాలు పటిష్ఠమైన పోరాట సామర్థ్యాలను కలిగి ఉండేలా చూడాలి. సైనికులు తమ వ్యూహాత్మక పోరాట సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు. దేశ భద్రత, ప్రధాన ప్రయోజనాలను కాపాడాలని సైన్యానికి సూచించినట్లు ఆ వార్తా సంస్థ పేర్కొంది.

## ప్రజా నాడి




## రైతు భరోసా కోసం రాష్ట్రవ్యాప్తంగా భారాస ఆందోళనలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
బీఆర్ఎస్ నేత కేటీఆర్ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా భారాస నేతలు రైతుభరోసా కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలనుఅవలంబిస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. రైతు భరోసాపై సబ్ కమిటీ వేశాం.. ఆ కమిటీ రిపోర్ట్ వచ్చాక వచ్చే సీజన్ నుంచి రైతు భరోసా వేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ వాన కాలం పంటకి రైతు భరోసా కింద ఎకరానికి 7,500 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలలోఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను నిలువునా మోసం చేస్తోందన్నారు. ఎకరానికి 7,500 రైతులకు పెట్టుబడి సాయంకింద ఇవ్వకుండా రైతులకు కన్నీళ్లు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు.



## పొలిట్రిక్స్

మూసీ మురికి కంటే
ముఖ్యంగా ముందు ,
కావాలోయ్ శుద్ధి
నేటి రాజకీయంబునందు !
పెద్ద మనసుతో పార్టీలు
సహకరిస్తే ముందుకు,
రాకుండా ఉంటుందా
శుద్ధితో ప్రజల చెంతకు !

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి

# జీవో 29 వల్ల మాకు అన్యాయం

పొందేవారు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందే అర్హత లేదని పేర్కొన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నంత మాత్రాన, తాము పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాదని స్పష్టం చేశారు. సీఎం తమను పిలిపించుకొని బాధ వినాలని విజ్ఞప్తి చేశారు. అశోక్‌నగర్ వద్ద గ్రూప్‌-1 అభ్యర్థుల ప్రెస్‌మీట్‌ను పోలీసులు అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. లాఠీఛార్జ్ వద్దని సీఎం చెప్పినా పోలీసులు వినడం లేదని అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గాంధీభవన్ ముట్టడికి వారు పిలుపునివ్వడంతో అక్కడా భారీగా పోలీసులు మోహరించారు. 'ప్రతిపక్షాలతో మాట్లాడే బదులు మాతో మాట్లాడండి. ఆర్థికంగా, మానసికంగా చితికిపోయి ఉన్నాం. మా బాధ వినండి. రాజకీయాలకు మేము అతీతం. మాకున్న చివరి అవకాశం చేజార్చకండి. ఇదేనా ప్రజాపాలన? దయచేసి ఆలోచించండి" గ్రూప్‌-1 అభ్యర్థులు తెలిపారు. మరోవైపు తెలంగాణ గ్రూప్‌-1 పరీక్షలకు దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు ఇటీవలే కొట్టివేసింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 21 నుంచి గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి శనివారం మాట్లాడుతూ గ్రూప్ వన్ అభ్యర్థులు కొన్ని పార్టీల మాటలు విని భవిష్యత్తు పాడు చేసుకోవద్దని, ఆందోళనలు విరమించి అందరూ గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్స్ రాయాలని కోరారు. వాయిదాల వల్ల విద్యార్థులు ఇతర ఉద్యోగాలు చేసుకోలేక పోతున్నారని తెలిపారు. న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్ష విధానాన్ని సమర్థించాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఒక అన్నగా మీకు తోడుంటానని, అభ్యర్థులందరూ మెయిన్స్?కు సిద్ధం కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. నిరసన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జ్‌లు చేయవద్దని తెలిపారు.

# ఐదు స్తంభాలపై భారత్ 'హెల్త్‌కేర్' స్ట్రాటజీ

## - ప్రధాని మోదీ



వారణాసి (ప్రజా మంటలు):
భారత్ ఆరోగ్య వ్యూహాలు ఐదు స్తంభాలపై ఆధారపడి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నేడు భారత్ దేశం వైద్య రంగంలో ప్రివెంటివ్ హెల్త్ కేర్, సకాలంలో వ్యాధి నిర్ధారణ, ఉచిత, చౌకమైన చికిత్స, చిన్నచిన్న పట్టణాల్లో మెరుగైన వైద్యం, వైద్యుల కొరతను భర్తీ చేయడం, వైద్యరంగంలో సాంకేతిక విస్తరణ వంటి ఐదు స్తంభాలను కలిగి ఉందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన సొంతనియోజక వర్గంలోని వారణాసిలో కంచి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌జే శంకర కంటి ఆస్పత్రిని ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లో రూ.6,700 కోట్లతో పలు అభివృద్ధికి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ శంకర ఆస్పత్రి వల్ల యూపీతోపాటు మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని మొ?త్తం 20 జిల్లాలోని ప్రజలకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. ఈ ఆసుపత్రి రాకతో ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న కాశీ, ఇకపై ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా మారుతుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంపై కంచి కామకోటి పీఠం శంకరాచార్యులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రశంసలు కురిపించారు. భగవంతుని ఆశీస్సుల వల్లే మోదీ లాంటి మంచి నేతలు వచ్చారని, ఆయన ద్వారా భగవంతుడు ఎన్నో మంచి పనులు చేయిస్తారని అన్నారు. వారణాసిలోని ఆర్‌జే శంకర్ కంటి ఆసుపత్రిని ప్రధాని ప్రారంభించిన సందర్భంగా విజయేంద్ర సరస్వతి స్వామిజీ మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనను 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్' అని విజయేంద్ర సరస్వతి స్వామి అభివర్ణించారు. ఇది భద్రత, సౌఖ్యం, పౌరుల క్షేమంపై దృష్టిసారించిన గొప్ప పాలన అని అన్నారు. మోదీ పాలన ప్రపంచానికే ఒక 'రోల్ మోడల్'గా నిలిచిందని, సాంస్కృతిక పునరుజ్జీవనంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, అందుకు సోమ్‌నాథ్, కేదార్‌నాథ్‌లే ఉదాహరణలని స్వామిజీ అన్నారు. వారణాశిలో ఆర్‌జే శంకర కంటి ఆసుపత్రి ప్రారంభించడంతో, అభివృద్ధి, సేవ వైపు కాశీ ప్రయాణంలో కొత్త అధ్యయం ప్రారంభమైందని యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో రూ.2500 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టిందని పేర్కొన్నారు.

# నిఘా నీడన గ్రూప్‌-1 మెయిన్స్

హాజరు కానున్నారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తోంది. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితులను సమీక్షించనుంది. ఈనెల 21 నుంచి 27వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలకు నగర పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనలు తారస్థాయికి చేరడంతో పశ్నపత్రాల తరలింపు, పరీక్ష నిర్వహణ, తిరిగి జవాబు పత్రాలు తీసుకెళ్లడం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా గట్టి పోలీసు బందోబస్తు కల్పించాలని నిర్ణయించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఎస్?.ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ విధుల్లో ఉంటారు. అదనంగా ఒక పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తుంటారు. భద్రతా పరమైన ఏర్పాట్ల పర్యవేక్షణకు మూడు కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు.ప్రశ్నపత్రాలు, జవాబు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారిగా జీపీఎస్? ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగిస్తోంది. స్ట్రాంగ్ రూముల నుంచి పరీక్ష కేంద్రానికి తరలించే వాహనాలకు జీపీఎస్? అమర్చి టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. వాహనం ఒక్కనిమిషం ఆగినా వెంటనే గుర్తించి అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. గ్రూప్‌-1 పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. వాచీలు, కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదు. మంగళసూత్రం, గాజులు మినహా ఆభరణాలను తేనివ్వరు.

# ఢిల్లీ కాలుష్యానికి కారణం.. భాజపా నీచ రాజకీయాలే

## - అప్పటి అండర్ వరల్డ్ ముంబయిలా నేడు ఢిల్లీ

## - సీఎం ఆతిశీ మండిపాటు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
దేశ రాజధాని నగరంలో పెరుగుతున్న వాయు, నీటి కాలుష్యానికి భాజపా నీచ రాజకీయాలే కారణమని దిల్లీ సీఎం ఆతిశీ మండిపడ్డారు. నగరంలో గాలి నాణ్యత క్షీణత మొదలవ్వడంతో..కాళిండికుంజ్ వద్ద యమునా నది ఉపరితలంపై విషపూరిత రసాయనాల నురగ కనబడటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిన ఆతిశీ.. దిల్లీలో వాయు నాణ్యత క్షీణించడానికి భాజపా పాలిత రాష్ట్రాలైన హరియాణా, యూపీ కారణమని ఆరోపించారు. హరియాణాలో పంట వ్యర్థాల దహనం, డీజిల్ బస్సులు, ఇటుక బట్టీలు ఒకకారణం కాగా.. యూపీ నుంచి దిల్లీ -ఘాజియాబాద్ సరిహద్దులోని కౌశాంబి బస్ డిపోకు వేల సంఖ్యలో డీజిల్ బస్సులు రావడం, దేశ రాజధాని పరీవాహక ప్రాంతం (ఔఅఖీ)లో ఇటుక బట్టీలు, ఈ ప్రాంతంలోని థర్మల్ ప్లాంట్లు కూడా వాయు కాలుష్యానికి ఒక కారణంగా పేర్కొన్నారు. యమునా నదిలో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేయకపోవడం వల్లే నదిపై నురగ ఏర్పడుతోందంటూ భాజపాపై విరుచుకుపడ్డారు. యమునా నది ఉపరితలంపై ఏర్పడిన నురగను తొలగించేందుకు ఆదివారం రాత్రి నుంచి సిలికాన్ ఆధారిత డిఫోమర్లను వినియోగిస్తామన్నారు. హరియాణా రోజుకు 165 మిలియన్ గ్యాలన్ల పారిశ్రామిక వ్యర్థజలాలను బాధ్షాపుర్, ముంగేశ్‌పుర్, ఇతర కాల్వల ద్వారా యమునా నదిలోకి విడుదల చేస్తుండగా.. యూపీ సైతం 65 మిలియన్ గ్యాలన్ల నీటిని వివిధ కాల్వల ద్వారా వదులుతోందని ఆతిశీ మండిపడ్డారు. దేశ రాజధాని నగరంలో వాయు, నీటి కాలుష్యం పెరగడానికి భాజపా మురికి రాజకీయాలే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వ డేటా ప్రకారం.. పంజాబ్ పంట వ్యర్థాల దహనాలను సగానికి తగ్గగా.. యూపీ, హరియాణాల్లో మాత్రం పెరిగాయన్నారు. ఈ చర్యలే భాజపా నీచ రాజకీయాలకు అద్దంపడుతున్నాయని పేర్కొన్నారు. పంజాబ్ ప్రభుత్వం తగ్గించగలిగినప్పుడు.. హరియాణా, యూపీలోని భాజపా ప్రభుత్వాలు ఎందుకు తగ్గించలేవని ప్రశ్నించారు.

**అప్పటి అండర్ వరల్డ్ ముంబయిలా దిల్లీ మారింది: సీఎం అతిశీ**

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ లోని రోహిణి ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వెలుపల పేలుడు కలకలం సృష్టిస్తోంది. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి అతిశీ కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు.దేశ రాజధాని నగరంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు."నేడు చోటు చేసుకున్న పేలుడు ఘటన రాజధాని నగరంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయనే విషయాన్ని బహిర్గతం చేసింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కేంద్రం ప్రభుత్వంపై ఉంది. కానీ, భాజపా మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దిల్లీలో అధికారంలో ఉన్న ప్రభుత్వం చేస్తున్న పనులకు అంతరాయం కలిగించడానికి మాత్రం తన సమయాన్ని వినియోగిస్తోంది. దీని వల్లే అప్పటి అండర్ వరల్డ్ ముంబయిలా దిల్లీ పరిస్థితి మారింది. బహిరంగంగానే తూటాలు పేలుతున్నాయి. గ్యాంగ్‌స్టర్లు డబ్బు డిమాండ్ చేస్తున్నారు. వీటిని నియంత్రించే సామర్థ్యం భాజపాకు లేదు" అని 'ఎక్స్' వేదికగా తీవ్ర ఆరోపణలు చేశారు.దిల్లీ ప్రజలు పొరపాటున వారికి (భాజపాను ఉద్దేశిస్తూ) ప్రభుత్వ బాధ్యతలు అప్పగిస్తే.. ఆస్పత్రులు, విద్యుత్, నీటి సరఫరా వంటి సదుపాయాల్లో ఆటంకం కలిగే అవకాశం ఉండేదని అతిశీ అన్నారు. కాగా.. దిల్లీలోని రోహిణి ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వెలుపల తెల్లవారుజామున పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, క్రైమ్, ఎఫ్ఎస్ఎల్ బృందాలు, బాంబు డిస్పోజల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు.ఈ పేలుడు ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కానీ, పేలుడు ధాటికి పాఠశాల గోడ కూలిపోయింది. శబ్ద తీవ్రతకు సమీపంలోని కారు అద్దాలు పగిలిపోయాయి. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని దుకాణాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై తాజాగా స్పందించిన సీఎం అతిశీ భాజపాపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన భాజపా కౌంటర్ ఇచ్చింది. తోలుబొమ్మ సీఎం అంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. సమస్య పరిష్కారం గురించి ఆలోచించకుండా.. ఈ సమయంలో రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొంది.

# కాంగ్రెస్ 'మహా' వ్యూహ రచన

**అధికారాన్ని 'చే'జిక్కించుకునేందుకు కసరత్తు**

**రంగంలోకి సీనియర్లు, అనుభవజ్ఞులైన నేతలు**

**ఏఐసీసీ పరిశీలకుల భేటీలో మంత్రి ఉత్తమ్, సీతక్క హాజరు**



ముంబై (జనంసాక్షి) :
నవంబర్‌లో జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహ రచన చేస్తుంది. అందులో భాగంగా శనివారం అర్ధరాత్రి వరకూ ఆ పార్టీ సీనియర్ నేతలు ముంబైలో ఎన్నికల ప్రచార వ్యూహానికి ప్రణాళికలు రూపొందించారు. ముందెన్నడూ లేని రీతిలో ఆ పార్టీ సీనియర్లను, అనుభవజ్ఞులైన నేతలను రంగంలోకి దింపింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారవ్యూహంపై ఏఐసిసి పరిశీలకుల భేటి కాగా, మాజీ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భుపేష్ బఘేల్, చరణ్ జిత్ చన్నీలతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రులు టి.యస్.సింగ్ దేవ్, పరమేశ్వరన్‌లు సమాలోచనలు జరిపారు. మహారాష్ట్ర ఇన్‌చార్జి రమేష్ చెన్నితాల అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు తెలంగాణ నుంచి మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖామంత్రి సీతక్కతో పాటు కర్నాటక నుంచి యం.బి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు. అధికార బిజేపి, షిండే ఆధ్వర్యంలోని శివసేనలను ధీటుగా ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి దోహదపడే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న శివసేన(షిండే), బిజెపిల కూటమిని ఎదుర్కోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకుగాను ఈ సమావేశం కసరత్తు చేసింది.

# ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు కు ఉద్యోగుల, ప్రైవేట్ పాఠశాల మద్దతు..

**ప్రైవేట్ విద్యాసంస్థల ఉద్యోగులకు అండగా ఉంటా!**

**వివిధ జిల్లాల్లో విస్తృత పర్యటన**

మంచిర్యాల అక్టోబర్ 20 :(ప్రజా మంటలు) :
ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్, పెంచికల్ పేట్, కౌటాల, సిర్పూర్, బెజ్జూరు తదితర మండలాల్లోనూబీ కాగజ్ నగర్ పట్టణంలోనూ తదితర ప్రాంతాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సిర్పూర్ పేపర్ మిల్లు తదితర ప్రాంతాలలో పర్యటిస్తున్నప్పుడు అక్కడ ఉన్నటువంటి పుర ప్రముఖులు, పట్టభద్రులు శేఖర్ రావును కలిసి, అనేక రకాల సమస్యలను వివరించారు. ముఖ్యంగా సిర్పూర్ పేపర్ మిల్లు విడుదల చేసినటువంటి విషవాయువుల వల్ల చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు పూర్తిగా కలుషితమై పోయాయి. ఇప్పుడు ఆ పరిశ్రమ నడవక పోయినప్పటికీ, అప్పటి కాలుష్యం వల్ల ఏర్పడిన అనారోగ్యాల, అంగవైకల్యాల వల్ల ఇంకా కూడా జనాలు బాధలు పడుతున్నారని తెలిపారు. అయితే ఆ పేపర్ మిల్లులో ఉన్నటువంటి గ్రౌండ్లో వాకింగ్ చేసుకుంటామంటే కూడా ఇప్పుడు ఉన్నటువంటి అక్కడి సిబ్బంది అనుమతి ఇవ్వకుండా అనేక రకాలైన ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిజానికి వారి వల్ల ఏర్పడినటువంటి ఇబ్బందులని దిగమింగుకొని కూడా ఈ ప్రాంత వాసులు వారికి ఎంతో సపోర్ట్ చేసినప్పటికీ, వారు మాత్రం కనీసం గ్రౌండ్లో ఉదయమే ఆరోగ్యం కోసం నడక నడిస్తే దానికి కూడా అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని వాపోయారు. వీటిపై శేఖర్ రావు మాట్లాడుతూ వారి ప్రతి యొక్క సమస్యని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. అక్కడి పట్టభద్రులు, పుర ప్రముఖులు స్థానికులు మేము సైతం శేఖర్ రావుతో అని నినాదాలు చేశారు. తమ సంపూర్ణమైన మద్దతును ప్రకటించారు.
ఆ తర్వాత అనేక ప్రైవేటు విద్యాసంస్థలను, ప్రభుత్వ గురుకులాలను, మోడల్ స్కూల్ లను కలిసి అక్కడ ఉన్నటువంటి బోధన, బోధనేతర సిబ్బంది తోటి వారి సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా ఉద్యోగస్తులకి,









రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఫీజు రీయంబర్స్మెంట్ విషయములో అనేక రకాలైన ఇబ్బందులని యాజమాన్యాలు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థులకు కూడా ఉపకార వేతనాలు అందక వారు కూడా అనేక రకాలైనటువంటి ఇబ్బందులని ఎదుర్కొంటున్నారు. మరి అటు యాజమాన్యాలకు, ఇటు విద్యార్థులకు వెంటనే స్కాలర్షిప్స్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్నటువంటి బోధన, బోధనేతర సిబ్బందికి 10 లక్షల రూపాయల ఆరోగ్య భీమా మరియు జీవిత బీమా వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తోటి చర్చించి చర్చిస్తానని తెలియజేశారు. అంతేకాకుండా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తో పాటు, ప్రతి సంవత్సరం జాబ్ కాలండర్స్ వచ్చే విధంగా, త్వరితగతిన ఉద్యోగ నియామకాలు జరిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోటి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరైతే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో తమ ఓటుని నమోదు చేసుకోలేదో వారిని వెంటనే నమోదు చేసుకోవాలని, తనకి తమ సంపూర్ణ మద్దతుని అందించాలని కోరారు. ప్రతీ ఒక్కరు కూడా కలిసిన ప్రతీ చోట కూడా లిమేము సైతం శేఖర్ రావు తోలి అని నినాదాలు చేస్తూ, ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ సంపూర్ణ మద్దతుని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు తో పాటు పెద్దపల్లి కిషన్ రావు (ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ), ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దేవ భూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, చారీ జాయింట్ సెక్రటరీ, రోహన్ బరాయి, సంజయ్ సింగ్ మరియు ఆసిఫాబాద్ జిల్లా ట్రస్మా బాధ్యులు, మీడియా ప్రతినిధులు పుర ప్రముఖులు పట్టభద్రులు స్థానికులు వేలాది మంది పాల్గొన్నారు.

# నేటి నుంచి గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు

రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. . గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 46 ఎగ్జామ్ సెంటర్లను సిద్ధం చేశారు. ఈ పరీక్షకు 33,383 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఎగ్జామ్ హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, టీజీపీఎస్సీ కార్యాలయ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తారు.

# జర్నలిస్టుపై దాడి కేసులో ముగ్గురి రిమాండ్

**మరో ముగ్గురి మాటేమిటి? నిందితులందరినీ అరెస్టు చేయాలి - సుదర్శన్ భద్రత కై డిమాండ్..**

**పరామర్శించిన డబ్ల్యుజేఐ బృందం**

ఖమ్మం, అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
ఆరుగురు వ్యక్తులు విచక్షణారహితంగా జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి, ఖమ్మం ప్రైవేటు వైద్యశాలలో
చికిత్స పొందుతున్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల ఆదాబ్ హైదరాబాద్ పత్రిక విలేఖరి సుదర్శన్ ను బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధి బృందం పరామర్శించింది. సుదర్శన్ పై దాడి చేసిన మిగతా ముగ్గురిని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని, సుదర్శన్ కు తగిన బద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీరుబాటిలళ్ళు, ఇనుప రాడ్లతోఆరుగురు వ్యక్తులు జరిపిన దాడిలో ఛాతి, దవడ ఎముకలు విరిగి ఇంటెన్సివ్ కేర్ లో చికిత్స పొందుతున్న సుదర్శన్ ను పరామర్శించిన డబ్ల్యూజేఐ నేతలు ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ పై దాడి ఘటనలో పాల్గొన్న వ్యక్తులకు సంబంధించి వీడియో ఫుటేజ్ సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం అయినప్పటికీ, ఇందులో కేవలం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కుపంపి, మరో ముగ్గురి విషయంలో విచారణ పేరిట కాలయాపన చేస్తుండటం అనేక అనుమానాలకు తావునిస్తున్నదని యూనియన్ నాయకులు తాడూరు కరుణాకర్, న్యాలకొండ అనిల్ రావు అన్నారు. ఇల్లందు పోలీసులు రాజకీయ నేతలు,లేదా ఇతరత్ర ఒత్తిళ్లకు తలవొగ్గి ఈ కేసులో నిందితులను ఉపేక్షిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి



లేదని హెచ్చరించారు. సుదర్శన్ పై గతంలో కూడా హత్యాయత్నం జరిగిందని, అదృష్టవశాత్తు ఈ రెండు ఘటనల నుండి ఆయన బతికి బయటపడ్డారని, కనుక భవిష్యత్తులో ఆయన ప్రాణాలకు రక్షణ కల్పించే బాధ్యత స్థానిక పోలీస్ యంత్రాంగంపైనే ఉందన్నారు. జర్నలిస్ట్ సుదర్శన్ పై జరిగిన పాశవికదాడిని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలకు తావు లేదన్నారు. ఒక పాత్రికేయునిపై దాడి జరపడం అంటే, అది యావత్ పాత్రికేయ లోకంపై జరిగిన దాడిగాభావించాల్సి ఉంటుందన్నారు. జిల్లా మంత్రి, ప్రభుత్వం ఈ విషయంలో స్పందించాల్సిన అవసరం ఉందని,ఇల్లందు ఘటనపై సమగ్ర విచారణ జరిపించి,దోషులు ఎంతటి వారైనాకఠినంగా శిక్షలు పడే ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు. ఖమ్మం ఆస్పత్రిలో జర్నలిస్టు సుదర్శన్ వారి కుటుంబ సభ్యులను కలసి పరామర్శించిన వారిలో డబ్ల్యూజేఐ నాయకులు ఆడెపు లక్ష్మీనారాయణ, డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.





# చింతకుంట చెరువులో చేప పిల్లలు విడుదల చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
మత్స్యకారులకు 100% సబ్సిడీతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లో భాగంగా జగిత్యాల జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యం లో జగిత్యాల పట్టణ చింత కుంట చెరువు వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి తో కలిసి పనిచేస్తానని పునరుద్ఘాటించారు. చింత కుంట చెరువు లో 2 లక్షల చేప పిల్లలు విడుదల చేయటం జరిగిందన్నారు. జగిత్యాల నియోజకవర్గం లో 155 చెరువుల్లో 20 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టామని గంగపుత్రులు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గంగ పుత్రులు సమస్యల పరిష్కారం కోసం ఎల్లపుడూ కృషి చేస్తానన్నారు.మత్స్య పారిశ్రామిక సంఘం లో మహిళలు భాగస్వామ్యం పెరగాలన్నారు. రైతు బజార్ నేడు హోల్ సెల్ మార్కెట్ కు అడ్డాగా మారిందని, జగిత్యాల బీట్ బజార్ లో 4 కోట్ల తో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. వెజ్ నాన్ వేజ్ మార్కెట్ తో జగిత్యాల ప్రజలకు మత్స్య కారులకు లాభదాయకమన్నారు.రోడ్ల పై మాంసం,చేపల విక్రయం ఆరోగ్య దాయకం కాదన్నారు. మార్కెట్ ల విజయవంతానికి అందరూ కలిసి కృషి చేయాలి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ,జిల్లా మత్స్య శాఖ అధికారి,మున్సిపల్ కమిషనర్ చిరంజీవి,వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, జిల్లా సంఘం అధ్యక్షులు ప్రవీణ్, పట్టణసంఘం అధ్యక్షులు గుమ్ముల అంజయ్య, కౌన్సిలర్ లు బాలే లత శంకర్,పద్మ పవన్, జుంభర్తీ రాజ్ కుమార్, పాంబాల రాంకుమార్, క్యాధసు నవీన్,పాక్స్ డైరెక్టర్ ఆరుముల్ల గంగారం, బాల ముకుందం, జుంభర్తీ శంకర్, గంగాపుత్ర సంఘం సభ్యులు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# కోరుట్లలోని 9,10,11, వార్డులలో రోడ్ల దుస్థితి

## పట్టించుకోని నాయకులు - అధికారులు - రోడ్డెక్కిన ప్రజలు

కోరుట్ల అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని 9, 10, 11 వార్డులోని ప్రజలందరూ కలిసి వార్డులో గల రోడ్ల దుస్థితి పై నిరసన గలం విప్పారు. గత10 సంవత్సరాల నుండి ప్రమాదకరమైన గుంతలు ఉన్న పరిస్థితిలో, పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలు, ముసలి వాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాహణదార్లు, బైకులు, కార్లు రవాణా వాహనాలను రిపేర్లు చేయించలేక పోవడంతో పాటు అనేక మార్లు ప్రమాదానికి గూడా గురయ్యారని, ప్రకాశం రోడ్ గాయత్రి బ్యాంకు నుండి రైల్వే స్టేషన్ల వరకు ఉన్న రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంద ఈ ప్రాంతావాసులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వల్ల పడడం జరుగుతుంది కొన్నిచోట్ల ప్రజలు పడడం జరిగి గాయాలు కావడంతో పలు ఇబ్బందులకు అవుతున్నారు. అదేవిధంగా వర్షాకాలంలో మద్దూరు చెరువు నుండి వచ్చే నీరు వల్ల ఈ 9,10, 11 వార్డులు కూడా ప్రతి ఒక్క ఇంట్లో నీరు చేరడం జరుగుతుంది ఇవి ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడంలేదని ఈరోజు రోడ్డు మీద ప్రజలు నిరసన తెలియజేయడం జరిగింది. ఇకనైనా అధికారులు ఈ కొత్తప్రభుత్వంలోనైనా ప్రజల ఇబ్బందులను గమనించి మా వార్డుల రోడ్డు పరిస్థితి బాగుచేయినహాదంతో పాటు, మద్దూరు చెరువు నుండి వచ్చే నీటి ప్రవాహం దాన్ని దృష్టిలో పెట్టుకొని వార్డులో కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని,, ఈ మధ్యలో చెరువు నుంచి వచ్చే నీటి సమస్యను శాశ్వత పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 9, 10,11 వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# అన్నదమ్ముల గోడవలో అన్నను నరికి చంపిన తమ్ముడు




మల్లాపూర్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు)
మల్లాపూర్ మండల కేంద్రంలోని ఓబులాపూర్ గ్రామ శివారులోని గోదావరి బ్రిడ్జి వద్ద, పల్లెపు సాయిలు (34) అతనిని తన తమ్ముడు చందు (32), గోడవపడుతూ, తల్వార్ తో అన్న సాయిల్ పై దాడి చేయడంతో సాయిలు అక్కడికక్కడే మరణించాడు. తమ ఇంటి వద్ద భూమి విషయంలో, గత కొన్ని సంవత్సరముల నుండి గొడవ పడుతూ గతంలో వీరిద్దరూ కొట్టుకొనగా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు అయ్యాయి. అటు పాత గొడవలు మనసులో పెట్టుకొని తమ్ముడు చందు తల్వారితో తన అన్న సాయిలును మెడపై నరకగా సాయిలు అక్కడికక్కడే మరణించాడు. మల్లాపూర్ పోలీసులకు సమాచారం రాగా మెట్పల్లి డివిస్పి ఉమామహేశ్వర శర్మ,, మెట్పల్లి సిఐ నిరంజన్ రెడ్డి మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి మృతుని పరిశీలించి చూడగా, మృతుని తల, మెడ పూర్తిగా తెగి, వేరుకాగా సాయిలు మరణించినట్లు గుర్తించారు. మృతుని శవపంచనామా జరిపి, శవ పరీక్ష కొరకు ఫోటోలు తీయించి మెట్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. నేరస్తుడైన పల్లెపు చందు పరారీలో ఉన్నాడు అతనిని వెంటనే పట్టుకొని తదుపరి చర్యలు తీసుకొనబడును సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# కులాన్ని తప్పుదారి పట్టిస్తున్న నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా నాయకులు..



కరీంనగర్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు)
కరీంనగర్ జిల్లాలో నాయి బ్రాహ్మణ సంఘం ఎన్నికల పేర జిల్లాలో ఉన్న పాత పేద్దమనుషులు నేనంటే నేనే అధ్యక్షుడినని కరీంనగర్ లో ఎవరికి వారే కొంతమంది వారి బంధువులతో జిల్లా కమిటీ ఎన్నికలను 22 వ తేదీ మంగళవారం రోజున ఏకపక్షంగా జరపాలనుకోవడం సరికాదని, అందరినీ కలుపుకొని కొత్త సభ్యత్వాలు తీసుకొని సరియైన సమయం ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని కొంత మంది సంఘ సభ్యులు కోరుతున్నారు. గత 20 సంవత్సరాల నుండి వారే అధ్యక్షులు గా ఉంటు వాళ్ల స్వలాభం కోసం కులాన్ని అడ్డు పెట్టుకొని జాతికి అన్యాయం చేసి ఎవరికి వారే జిల్లా కమిటీలు వేసుకొని కులాన్ని భ్రష్ట పట్టిస్తున్నారని. వారి స్వంత ఎదుగుదల కోసం కొంతమంది రాజకీయ నాయకుల దగ్గర తోత్తులుగ చేరి పబ్బం గడుపుకుంటున్నారని వీరు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఎందరో నిరు పెద నాయి బ్రాహ్మణులు ఉన్నారని. వారి గురించి ఏనాడూ ఏ నాయకులు మాట్లాడలేదని. వారు రోజు కూలికి వేలితే గాని పుట గడవని స్థితి లో చాలా నీరు పేద కుటుంబాలు దీన స్థితిలో ఉన్నాయని. నాయి బ్రాహ్మణ కుటుంబాలు వారిని ఏ రోజైన పరామర్శించడానికి రాలేనివారు నాయకులా అంటూ వాపోయారు. గ్రామాలలో సభ్యులా మధ్య గొడవలు సృష్టించి, వర్గాలుగా విభజించి, కులంలో ద్వేషాభావనలు రేపాయం ఆపి, అందరి సమ్మతితో ఎన్నికలు నిర్వహించి, కులప్రభావాన్ని కాపాడాలని వీరు కోరుతున్నారు.



# విద్యారంగాభివృద్ధికి తోడ్పాటునందించి ఆదర్శంగా నిలుస్తా

## విద్యావ్యవస్థలో మార్పులు ఎంతైనా అవసరం - ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా నరేందర్ రెడ్డి

జగిత్యాల అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
సమాజంలో విద్యావ్యవస్థను మార్చాల్సిన అవసరం ఎంతగానో ఉందని మరియు నూతన విద్యా విధానం ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు రావడానికి ఆస్కారం ఉందని ఆల్ ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్.వి. నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి జగిత్యాలలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషిచేసి ఉత్తమంగా ఉండాలని మరియు విద్యార్థులకు అన్ని రకాలుగా తోడ్పాటు అందించి అగ్రగామిగా నిలవాలని, పట్టభద్రులకు అన్ని విధాలుగా చేయుతనిస్తానని మరియు వారికి అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పించే విధంగా కృషి చేస్తానని చెప్పారు నిర్లక్ష్యానికి గురైనటువంటి వర్గానికి తోడ్పాటు అందించి వారి అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల బరిలో ఉన్నానని ముఖ్యంగా ఉద్యోగాల కల్పనలో వారికి చేయూతనివ్వడమే కాకుండా కావలసినటువంటి సమకూర్చి ఉద్యోగాలు సాధించే విధంగా ప్రోత్సాహం అందిస్తానని తెలుపుతూ అందుకు అనుగుణంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్ %ు% అదిలాబాద్ నియోజకవర్గాల కేంద్రంగా ఉచిత కోచింగ్ సెంటర్లను ప్రారంభించి శిక్షణ ఇప్పిస్తూ వారిని ఉద్యోగాల వైపు పయనించే విధంగా కృషి చేస్తానని చెప్పారు.
ఎయిడెడ్ స్కూల్ టీచర్లకు హెల్త్ కార్డులు వచ్చే విధంగా కృషి చేస్తానని మరియు మన స్కూల్లో టీచర్లకు ఎదురవుతున్న 010 చెల్లింపు విధానాన్ని అమలు చేసినందుకు ప్రణాళికను రూపొందిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగ అవకాశం మెరుగుపరచడంలో ప్రైవేటు ఉపాధ్యాయులు అందరికీ వారికి హెల్త్ కార్డు జారీ చేసే విధంగా చర్చలు జరుపుతామని చెప్పారు. ముఖ్యంగా నేటి సమాజంలో పట్టభద్రులు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారని నిర్ణయాత్మక పాత్రను పోషిస్తూ ప్రభుత్వాన్ని ఆలోచింపచేస్తుందని చెప్పారు .అతి కీలకమైనటువంటి ఓటరు నమోదులో అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని రానున్నటువంటి శాసనమండలి ఎన్నికలలో అభివృద్ధిని ఆకాంక్షించే విద్యాధికుడైన తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల నుంచి విచ్చేసిన యజమాన్యాలు, కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇండియా ఫోటోగ్రఫీ సమ్మిట్లో పంతకాని రాజు ఫోటో ఎంపిక




మహాదేవపూర్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
హైద్రాబాద్ లో ఈనెల 15న జరిగిన ఇండియా ఫోటోగ్రఫీ సమ్మిట్ ఐ పి ఎస్ 2024 జాతీయ ఛాయాచిత్ర పోటీల్లో మహాదేవపూర్ ఫోటోగ్రాఫర్ పంతకాని రాజు తీసిన ఫోటో ఉత్తమ ఛాయాచిత్రంగా ఎంపికైంది. పండుగలు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై మహారాష్ట్ర కొల్హాపూర్ 'పఠాన్ కొడలి' లో జరిగిన పసుపు పండుగ మీద తీసిన ఛాయచిత్రం జాతీయ ఉత్తమ ఛాయాచిత్రంగా రాణించడం గర్వంగా ఉందని ఫోటోగ్రాఫర్ పంతకాని రాజు అన్నారు ఐ పి ఎస్ ఇండియా ఫోటోగ్రఫీ సమ్మిట్ మ్యాగజైన్ లో నేను తీసిన హల్దీ ఫెస్టివల్ ఛాయాచిత్రం ప్రచురించడం చాలా సంతోషంగా ఉందని, ఒక ఫోటోగ్రాఫర్ గా ఇంతకంటే సాధించాల్సింది ఇంకెముందని అన్నారు.

# స్కూటీ ని ఢీకొన్న ఇసుక లారీ..



## ప్రమాదం లో గాయపడిన యువకుడు..

గొల్లపల్లి అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
గొల్లపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మల్లన్నపేట గ్రామానికి చెందిన గర్వాంద శశి అనే యువకుడు స్కూటీ పై వెళ్తున్న క్రమంలో స్థానిక బస్ స్టాండ్ వద్ద ఇసుక లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో వెంటనే స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం అంబులెన్సు ద్వారా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుండి కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి వైద్యం అందిస్తున్నారు.



# రైతుల పైన చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ

## రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన

ఎల్కతుర్తి అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడాలి వద్ద రైతుల తో కలిసి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశం మేరకు హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ సూచన మేరకు రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు ఈ సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి, మీకు రైతుల ఆందోళనలు కనపడతలేవ కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు కళ్ళకు గంతలు కట్టుకున్నారా, ఇదేనా రైతు భరోసా రుణమాఫీ మీద మీ చిత్తశుద్ధి, ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి రైతులను మోసగిస్తారా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. రైతు భరోసా 15000 ఇస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేస్తుందని అన్నారు అలాగే రుణమాఫీ మీద కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని పూర్తిగా రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దొంగ హామీలతో గద్దెనెక్కిందని మండిపడ్డారు. రుణమాఫీ అమలు కానీ రైతులకు వెంటనే కటాఫ్ తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రుణమాఫీ కానీ రైతులతో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల కోసం బిఆర్ఎస్ పార్టీ పోరాటానికి దిగుతుందని అన్నారు
ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరి స్వామి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెడ మహేందర్ మాజీ వైస్ ఎంపీపీ . తంగెడ నగేష్ మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు కడారి రాజు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్ బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్ యూత్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి జాగృతి అధ్యక్షులు విక్రమ్ గౌడ్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మదర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతూరి శంకర్ వోడితల యువసేన అధ్యక్షులు చిట్టి గౌడ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ సీనియర్ నాయకులు గుండా ప్రతాపరెడ్డి కుర్ర సాంబామూర్తి గౌడ్ వేముల సమ్మయ్య దేవేందర్ రావు సాతూరి చ%శీ%ద్రమౌళి అల్లకొండ రాజు కమలాకర్ రావు రవీందర్ రెడ్డి ప్రదీప్ రవీందర్ వెంకన్న ఐలయ్య కుమారస్వామి రాజేశ్వరరావు నాగేశ్వర్ మొగిలి బాబు శ్రీనివాస్ మాధవరావు కార్తీక్ నరేష్ రైతులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మహిళా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రోజా



జగిత్యాల అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
కోరుట్ల పట్టణానికి చెందిన న్యాయవాది రాచకొండ రోజా జగిత్యాల జిల్లా మహిళా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియామకమైనది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ సూచన మేరకు రాచకొండ రోజాను నియమించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

# యువత డ్రగ్స్ కు బానిసే కావొద్దు

## - మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు - డ్రగ్స్ అవేర్నెస్ పోస్టర్ విడుదల




సికింద్రాబాద్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
యువత డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. షాలోమ్ ఆఫ్ హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్ అవేర్నెస్ పోస్టర్ ను ఆదివారం ఆయన సెక్రటేరియట్ లో ఆవిష్కరించారు. డ్రగ్ ఫ్రీ హైదరాబాద్ సిటీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్కూల్లు జూనియర్ డిగ్రీ కళాశాలలు ఆయా సంస్థల్లో అవేర్నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అశోక్ తెలిపారు. కార్యక్రమంలో థామస్ వినోద్ కుమార్ హితేష్ సురేష్, పాల్గొన్నారు.

# కరెంటు షాక్ తో పశువు మృతి



గొల్లపల్లి అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో మారం చిన్న చంద్రయ్యకు చెందిన గేదె మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో దగ్గరలోని పొలాల వెంబడి వెతకగా ఒక ట్రాన్స్ఫార్ వద్ద కరెంట్ షాక్ తో చనిపోయి ఉంది. దీంతో రైతు బోరున విలపించాడు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ప్రజాసేవతోనే నాయకులకు గుర్తింపు

## కేంద్ర మంత్రి కిషన్రెడ్డి

### వారాసిగూడ లో ఫ్రీ మెడికల్ క్యాంప్ ప్రారంభం



సికింద్రాబాద్, అక్టోబర్ 20 (ప్రజామంటలు) :
క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవ చేసే నాయకులకే గుర్తింపు లభిస్తుందని, పేద ప్రజల కోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వారాసిగూడ బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్గనైజర్ మద్దెర్ల శ్యాంసుందర్ ను అభినందించారు. వందలాది మంది స్థానికులకు బీపీ, షుగర్, కళ్ళ పరీక్షలను చేసి, అవసరమైన ఆయుర్వేద, హెూమియోపతి, అల్లోపతి మందులను ఉచితంగా అందచేశారు. అలాగే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని, స్థానిక నాయకులకు, కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. కార్యకర్తలు సైనికులుగా పనిచేసి, రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వాలను నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ నాగేంద్ర స్వామి ఆలయంలో కలెక్టర్ ల ప్రత్యేక పూజలు



హుజురాబాద్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :
హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలో కొత్తపల్లి గ్రామంలోని నవగ్రహ సహిత శ్రీ నాగేంద్ర స్వామి దేవాలయంలో కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి, ఆంధ్ర ప్రదేశ్ అమరావతి కలెక్టర్ లు ఇద్దరు ఐఏఎస్ లు మిత్రులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి పందిళ్ళ భాస్కర్ శర్మ వారికి ప్రత్యేక పూర్ణకుంభ స్వాగతం పలికి నవగ్రహ పూజలు దోష నివారణ పూజలు పుట్టపూజ నవరసాభిషేకము కుంకుమ పూజలు తదితర ప్రత్యేక పూజలు వారిచే చేయించారు. ఆలయ ప్రత్యేకతలు తెలుసుకొని తామే వచ్చినట్లు ఈ సందర్భంగా ఐఏఎస్ లు వివరించారు ఈ సందర్భంగా ఆలయ పూజారి సమీపంలో కళ్యాణ మండపం కావాలని వారిని కోరగా సంబంధిత మునిసిపల్ ఇంజనీర్ అధికారులతో ఎస్టిమేషన్ వేసి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. సుమారు గంటపాటు ఐఏఎస్లు ఆలయం వద్ద గడిపి ప్రత్యేక పూజలు చేయడంతో పలువురు ఆసక్తిగా వారిని తిలకించారు. వారి వెంట హుజురాబాద్ తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషకు దివాకర్ల ఎనలేని సేవలు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## అక్టోబర్ 21...దివాకర్ల వేంకటావధాని వర్ధంతి

అభినవ 'నన్నయ'లా భావించబడి, సంప్రదాయ సాహిత్యానికి అండగా నిలిచి, మహామహోపన్యాసకునిగా పేరొంది అధిక శిష్య సంపదను పొందిన సాహితీమూర్తి ఆచార్య దివాకర్ల వెంకటావధాని.దివాకర్ల వేంకటావధాని (జూన్ 23, 1911 - అక్టోబరు 21, 1986) పరిశోధకులు, విమర్శకులు. దివాకర్ల వంశంలో పరీధావి నామ సంవత్సరం, ఆషాఢ పౌర్ణమి నాడు ఆకుతీగపాడు గ్రామంలో అమ్మమ్మ ఇంట్లో జన్మించారు. జన్మనక్షత్రం మూల. హరితస గోత్రుడు. వెల నాటి వైదిక బ్రాహ్మణుడు. కృష్ణ యజుర్వేద శాఖకు చెందినవారు.

ఇతని తండ్రి పేరు సుందర రామయ్య, తల్లి పేరు వేంకమ్మ. పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం యండగండి ఆయన స్వగ్రామం. తిరుపతి వేంకట కవులలో ఒకరైన దివాకర్ల తిరుపతి శాస్త్రి ఆయన పినతండ్రి. దివాకర్ల వేంకటావధానికి ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు. ఆయనే ఇంటికి పెద్దకొడుకు. బాల్యంలోనే ఇతని ప్రతిభా పాటవాలు వెలుగు చూశాయి. సహజ ధారణాశక్తితో చిన్నప్పుడే తిరుపతి వేంకటకవుల అవధాన పద్యాలను కంఠస్తం చేశారు. ఎనిమిదవ తరగతి చదివే సమయంలోనే ఆయన పద్యాలు భారతి మాసపత్రికలో ప్రచురిత మయ్యాయి. ఇంట్లోనే తన తండ్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నారు. రఘువంశం, ఆంధ్రనామ సంగ్రహం చదువుకున్నారు. తన గ్రామం యండగండిలో ఏడవ తరగతి వరకు చదివారు. ఆ తర్వాత ఉండిలో సంస్కృతం ప్రథమ భాషగా, తెలుగు ద్వితీయ భాషగా ఉన్నతపాఠశాల విద్య చదివారు. అనంతరం 1930-31లో బందరు హిందూ కళాశాలలో ఇంటరు చదివారు. ఆ సమయంలో విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లో వుంటూ పేదరికం కారణంగా వారాలు చేసి చదువు కున్నారు. విశ్వనాథకు ప్రియశిష్యుడిగా వుండి అతడి ఏకవీర నవలను చెబుతుండగా దివాకర్ల వేంకటావధాని వ్రాసేవారు.

విశ్వనాథ, కొడాలి వెంకట సుబ్బారావుల ప్రోద్బలంతో విశాఖ పట్టణం వెళ్లి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఏ. (ఆనర్సు) చేరారు. అక్కడ పింగళి లక్ష్మీ కాంతం, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, గంటి జోగి సోమయాజి ఆయనకు గురువులు. పాటిబండ మాధవశర్మ ఆయన సహాధ్యాయి. బి.ఏ. తరువాత ధర్మవరం రామకృష్ణమా చార్యులు గురించి విమర్శావ్యాసం వ్రాసి ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి మొట్ట మొదటి ఎం.ఏ (ఆనర్సు) పట్టాను పొందారు. తెన్నేటి విశ్వనాథం దగ్గర ఆంగ్లభాషా పరిజ్ఞానం సంపాదించారు. 1942 ప్రాంతాలలో వేదాధ్యయనం మొదలు పెట్టి, మహావ్రత చయనులు వద్ద నమక చమకాలను, దశశాంతులు మొదలైన వాటిని వల్లె వేశారు. 1957లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో ఆంధ్ర వ్యాయారంభ దశ - నన్నయ భారతము అనే విషయంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టాను సాధించారు.

1934లో అప్పటి ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ దివాకర్ల ను విశాఖపట్టణం లోని మిసెస్ ఏ.వి.ఎన్.కళాశాలలో తెలుగు పండితుడిగా నియమించారు. తరువాత పదోన్నతి పొంది అదే కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్‌కు అధ్యక్షుడిగా నియమింప బడ్డారు. 1951లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆంధ్రోపన్యాసకులుగా చేరారు. 1957లో రీడర్‌గా, 1964లో ప్రొఫెసర్‌గా, తెలుగు శాఖాధ్యక్షులుగా పదోన్నతి పొందారు. 1974-1975ల మధ్య కాలంలో ఎమినెంట్ ప్రొఫెసర్‌గా, 1975 నుండి 1978 వరకు యు.జి.సి.ప్రొఫెసరుగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఆయన పర్యవేక్షణలో 15మంది పి.హెచ్.డి, ఒకరు ఎం.ఫిల్ పట్టాలను పొందారు. దివాకర్ల శిష్యగణంలో ఎం.కులశేఖరరావు, ఇరివెంటి కృష్ణమూర్తి, పి.యశోదా రెడ్డి, సి.నారాయణరెడ్డి, ముద్దసాని రామిరెడ్డి మొదలైన వారు ఉన్నారు.

దివాకర్ల నలభైకి మించి గ్రంథాలను రచించారు. వాటిలో పద్యకృతులు, వచన రచనలు, విమర్శలు, వ్యాఖ్యానాలు, అనువాదాలు, టీకాతాత్పర్యాలు ఉన్నాయి. ఖండవల్లి లక్ష్మీ రంజనంతో కలిసి ఆంధ్ర మహా భారత సంశోధిత ముద్రణకు విపులమైన పీఠిక వ్రాశారు. తెలంగాణలోని మారుమూల గ్రామాలకు పిలవగానే వెళ్లి ఉపన్యాసాల ద్వారా అక్కడి ప్రజలకు తెలుగు భాషాసాహిత్య చైతన్యాన్ని కలిగించారు. అనేక కవిపండితుల గ్రంథాలకు చక్కని పీఠికలను, సమగ్ర సమీక్షలను అందించి వారిని ప్రోత్సహించారు. ఆయనకు అనేక సాహిత్య సంస్థలతో సంబంధం ఉండేది. వాటిలో ఆంధ్ర సారస్వత పరిషత్తు, యువభారతి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర



సాహిత్య అకాడమీ, సంస్కృత భాషా ప్రచార సమితి, ఆర్ష విజ్ఞాన సమితి, సురభారతి, కళాస్రవంతి అనేవి కొన్ని. ఆయన ఉపన్యాసాలకు జనం వేలకొలది వచ్చేవారు. వసు చరితము గురించి ఆయన ఉపన్యసిస్తుంటే శ్రోతలు వర్షంలో గొడుగులు పట్టుకుని నిలబడి ఉపన్యాసం విన్నారంటే ఆయన ఉపన్యాస కళ ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. దివాకర్ల సుమారు 15 అవధానములు చేశారు. విద్యార్థిగా ఉన్నపుడు బందరు హిందూ కళాశాలలో మొదటి అవధానం చేశారు. తరువాత ఉండి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో (హైదరాబాదు), ఆకాశ వాణిలో, విద్యుత్‌సౌధ (హైదరాబాదు) లో, కాకినాడ తదితర ప్రాంతాలలో అవధానాలు నిర్వహించారు.

కళాప్రపూర్ణ -1977లో విద్యా సనాథ, కవి భూషణ బిరుదములను పొందారు. దివాకర్ల 1986లో భారతీయ విద్యాభవన్ ముంబై వారి చండీ యాగానికి వెళ్ళిన సందర్భంలో. అక్కడ జైన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించు కున్నారు. ఆ సందర్భంలో ఆయనకు అధిక రక్తస్రావము జరిగి 1986, అక్టోబరు 21 తేదీన మరణించారు.

## ఇజ్రాయెల్ దాడి ప్రణాళికలు అమెరికా పెంటగాన్ నుంచే..

### - సంబంధిత పత్రాలు లీక్ చేసిన టెలిగ్రామ్ ఛానల్

న్యూఢిల్లీ, (ప్రజామంటలు):



అక్టోబర్ 1 నాటి దాడికి ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇజ్రాయెల్ సిద్ధం చేసిన ప్లాన్లు.. పెంటగాన్ నుంచి లీకయ్యాయి. దీనికి సంబంధించిన రెండు కీలక ఫైల్స్‌ను ఇరాన్ అనుకూల 'మిడిల్ ఈస్ట్ స్పెక్టేటర్' టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్టు చేశారు. పెంటగాన్ సోర్సుల నుంచి దీనిని సంపాదించినట్లు అందులో పేర్కొన్నారు. అక్టోబర్ 15-16 తేదీల్లో ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ చేసిన సన్నాహాలు దీనిలో ఉన్నాయి. ఫైవ్ ఐస్‌లోని దేశాలు మాత్రమే వాస్తవానికి వీటిలోని సమాచారం పొందగలవని ఆ ఛానల్‌లో పేర్కొన్నారు.ఇజ్రాయెల్ ఇప్పటికే దీనికి సంబంధించిన ఆయుధాలను సిద్ధం చేసినట్లు సదరు పత్రాల్లో ఉంది. ఆ దేశ వాయుసేన ఇప్పటికే విమానల నుంచి భూలక్ష్యాలపై ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు, మానవ రహిత విమానాలు, రిఫ్యూయలింగ్ ట్యాంక్‌లతో సాధన చేస్తున్నట్లు నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చెప్పింది. వీటి కోసం 16 గోల్డెన్ హారిజోన్ ఏఎల్‌బీఎం, 40ఐఎస్02 ఏఎల్‌బీఎంలను వాడినట్లు పేర్కొంది.కాకపోతే, ఈ పత్రాలు సరైనవా.. కాదా అన్నది అటు పెంటగాన్ లేదా యూఎస్ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కానీ ధ్రువీకరించలేదు. అమెరికా రక్షణ శాఖలో అధికారులు మాత్రం ఈ పరిణామం చాలా ఆందోళనకరమని వ్యాఖ్యానించినట్లు సీఎన్ఎన్ పేర్కొంది.ఇరాన్‌లో ఏయే లక్ష్యాలను ధ్వంసం చేయాలన్న అంశంపై ఇప్పటికే ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్ష్యాల జాబితాను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్).. ప్రధాని నెతన్యాహుకు, రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌కు సమర్పించినట్లు ఇటీవల ఛానల్ 12 న్యూస్ పేర్కొంది. "లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. ఎప్పుడు దాడి చేయాలన్నదే నిర్ణయం కావాలి" అని కాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కూడా ఓ కథనం ప్రచురించింది. లక్ష్యాల పూర్తి జాబితాను అమెరికాకు ఇవ్వకపోయినా.. సమాచారాన్నైతే అగ్రరాజ్యంతో ఇజ్రాయెల్ పంచుకున్నట్లు పేర్కొంది. చివరి నిమిషంలో లక్ష్యాలు మారే అవకాశాలనూ తోసిపుచ్చలేమని తెలిపింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగే నవంబరు 5కు ముందు ఏ క్షణాన్నైనా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయొచ్చని అగ్రరాజ్య అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## రైతు భరోసా ఏమైంది? బిఆర్ఎస్ ధర్నా

### నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

హుజురాబాద్ అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :




బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల నిరసన తెలిపారు. రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ, పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, హుజురాబాద్ మండల కేంద్రాల్లో రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలతో మునుపటి పద్ధతుల్లోనే నిరసనలతో హోరెత్తించారు. హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

హుజురాబాద్ లో :

పట్టణంలో ని అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం రోజున బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులను బి ఆర్ ఎస్ ప్రభుత్వం కెసిఆర్ గారి నాయకత్వంలో రైతుబంధు తో ఆదుకుందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని రైతులను రైతు భరోసా పేరుతో నట్టేట ముంచిందని వారన్నారు. రైతుబంధు సంవత్సరానికి ఎకరానికి 10,000 తో ఆదుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి ఎకరానికి 15000 రూపాయలు ఇస్తానని మోసపూరిత మాటలు చెప్పి రైతులందరికి ఎగ్గొట్టిందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిరసన కార్యక్రమం చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మెడలు వంచి రైతు భరోసాను ఇప్పించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు, బిఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేయడం జరిగింది.

# ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తులు

### సీనియర్ సిటిజన్స్ కు కమిటిల్లో బాధ్యతలు ఇవ్వాలి

### - హరి ఆశోక్ కుమార్,న్యాయవాది

జగిత్యాల అక్టోబర్ 20 (ప్రజా మంటలు) :

పేదల సొంతి0టి కలను సాకారం చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో,మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గృహ నిర్మాణ,పంచాయితీ,మున్సిపల్ శాఖల అధికారులు ఇందిరమ్మ కమిటీల ఏర్పాట్లు పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఉత్తర్వుల మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇల్లు కేటాయించనున్నారు. ఎంపికయిన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. ఊరూరా,పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు నియమించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు కార్యాచరణ అధికారులు రూపొందించారు. ఆయా కమిటీలు, అధికారులే లబ్ధిదారులను గుర్తించనున్నారు. తొలిదశలో ఇలా.... జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలు ఉన్నాయి.సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం మండలాలు, కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవ ర్గంలోని కోడీమ్యాల,మల్యాల మండలాలు సైతం జగిత్యాల జిల్లా పరిధి లోకి వస్తాయి. తొలి విడతలో భాగంగా ఒక్కో నియోకవర్గానికి 3,500 చొప్పున,జిల్లాకు సుమారుగా 12,000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నారు. అలాగే జిల్లాలోని 380 పంచాయతీలు,5 మున్సిపాలిటీల్లోని 134 వార్డుల్లో కమిటీల నియామకానికి అధికారులు ప్రక్రియ సిద్ధం చేశారు.ఎంపికకు నిబంధనలు ఇలా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు నిబంధనలు పాటించనున్నారు. లబ్ధిదారుడు తప్పనిసరిగా పేద, మధ్యతరగతి వారై ఉండాలి. ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. అద్దె ఇండ్లలో నివాస మున్నవారికే ప్రాధాన్యత నివ్వనున్నారు. ఒంటరి మహిళలకు, వితంతువులకు అవకాశం తప్పనిసరిగా ఉంటుంది. సొంత ఇంటినిర్మాణంకు స్థలం ఉన్న వారిని సైతం ఎంపిక చేయనున్నారు.

గ్రామ పంచాయతీల్లో కమిటీలు ఇలా.... గ్రామాల్లో పాలక వర్గాల గడువు ముగిసినందున సర్పంచ్ ల స్థానంలో ప్రత్యకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళా సంఘ సభ్యులు, గ్రామాభివృద్ధిపై అవగాహన కలిగిన ముగ్గురు గ్రామస్తులు, ఇందులో ఒకరు బీసీ,ఒకరు ఎస్సీ, కమిటీలో చోటు కల్పిస్తారు. పంచాయతీ కార్యదర్శి ని ఇందిరమ్మ కమిటీకి కన్వీనర్ గా పెడతారు.

మున్సిపాలిటీల్లో కమిటీలు ఇలా వార్డు కౌన్సిలర్ చైర్మన్ గా, ఇరువురు మహిళా పొదుపు సంఘాల సభ్యులు(ఇందులో ఒకరు బీసీ,ఎస్సీ,ఎస్టీ,లలో ఒకరు) ఉంటారు.వార్డు అధికారికి మెంబర్ గా కన్వేనర్ కమిటీలో చోటు కల్పిస్తారు. అర్హుల ఎంపిక లో,అభివృద్ధి లో అత్యంత అనుభ వం ఉన్న సీనియర్ సిటీజేన్స్ కు చోటు కల్పించాలని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ఆ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వంను కోరుతున్నారు. కాగా అధికారులు రూపొందించిన జాబితాని కలెక్టర్ కు సమర్పించిన అనంతరం జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది.



కమిటీల్లో సీనియర్ సిటీజేన్లను భాగస్వామ్యం చేయాలి

న్యాయవాది సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాటాల్డుతూ, పేదల సొంత ఇంటి కల సాకారం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం హర్షణీయం, గ్రామాల్లో,పట్టణాల్లో అభివృద్ధి పై ,అర్హులెవరు అనే విషయంలో సీనియర్ సిటీజేన్లకే ఎక్కువగా అవగాహన ఉంటుందని అన్నారు. ప్రభుత్వం పునరాలోలోచించి ఇందిరమ్మ కమిటీల్లో సీనియర్ సిటీజేన్లను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని మా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరసింహా రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

## మనసే మందిరం

మనసే మందిరం
ఆలోచనలకు
ప్రవర్తనకుజి
వ్యవహారానికిజి
మనసే మూలం

మనసు చేసే మాయ
జాలంలో చిక్కుకున్న
వ్యక్తి చంచాలనికి
గురవుతాడుజి

మనసుకు ఆశ
వుంటుంది
ఆశించిన దానికన్నా
ఎక్కువ
లభిస్తే ఆనందిస్తుంది

మనశక్తి తోనే
దృఢమైనజి
ఆత్మవిశ్వాసం
మనసు మాట
వినదుజి
వినేలా చేసుకోవడం
మనచేతిలో వుంటది

అలోచనలతో
ఆవేశాలతో
సందడిచేస్తుంది
మనసుకు కళ్లెం
వేయాలిజి

ప్రతి వ్యక్తి ఆత్మ
చైతన్యంతో
పురోగమించాలి
మనస్సనే
మందిరంలో
దివ్యమైన
జ్యోతిని వెలిగించాలి
జీవన శైలి మారాలి

అవివేకం అజ్ఞానం
అశాంతి
వదలాలిజి

సానుకూలత వైపు
పయనించాలి
మానవుడే
మానవుడు
దేహమే దేవాలయం
సంతృప్తియే
సంతోషం
జనహితమేజి
అభిమతంగ
ఆశయే జీవితానికి
దారి దీపం కావాలి

నేదునూరి కనకయ్య
మాజీ కరస్పాండెంట్ జస్టిస్
కుమారయ్యా లా కాలేజీ
కరీంనగర్
9440245771